


వెంకటశివరాంబాబుకు పిహెచ్‌డి ప్రదానం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల పరిధిలోని తోటపల్లికి చెందిన పామర్తి వెంకట శివ రాంబాబుకు పాట్నా ఎన్ఐటి పిహెచ్‌డి డిగ్రీ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా డాక్టరేట్‌ను ఆయనకు పాట్నాలో అందజేశారు. వ్యవసాయ వినియోగాలకు వైర్‌లెస్ కమ్యూనికేషన్ నెట్‌వర్క్ కోసం డ్రోన్ మార్గం ప్రణాళిక ఆప్టిమైజేషన్‌లో డాక్టర్ ఠీవీ అగర్వాల్ పర్యవేక్షణలో పరిశోధనలకు చేసినందుకుగాను వెంకట శివ రాంబాబుకు పిహెచ్‌డి పట్టా వరించింది. సాధారణ రైతు కుటుంబంలో పుట్టి పాట్నా ఎన్ఐటి పిహెచ్‌డి డిగ్రీని అందుకున్న వెంకట శివరాంబాబును గ్రామస్తులు, ప్రముఖులు అభినందించారు.



పట్టా అందుకుంటున్న రాంబాబు

డబ్బులడిగితే ఫిర్యాదు చేయండి

ఎన్‌టిఆర్ వైద్యసేవా ట్రస్ట్ ద్వారా వైద్యం పూర్తిగా ఉచితం

నెట్‌వర్క్ ఆసుపత్రిలో సొమ్ము అడిగితే 104కు కాల్ చేయొచ్చు

మొత్తం 3,225 రోగాలకు చికిత్స

జిల్లాలో నెలకు సగటున ఐదు వేల మందికి ఉచిత వైద్యం

డెంగీ, మలేరియా, టైఫాయిడ్, పాయిజన్ కేసులకు ఉచితంగా వైద్యం

ఎన్‌టిఆర్ వైద్యసేవా ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఐ.రాజీవ్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్‌టిఆర్ వైద్యసేవా ట్రస్ట్ ద్వారా ప్రభుత్వం అన్ని రోగాలకూ ఉచితంగా వైద్యం అందిస్తుందని, అలాకాకుండా ఈ పథకంలో చికిత్స పొందే రోగుల నుంచి నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో డబ్బులు వసూలు చేస్తే ఫిర్యాదు చేయవచ్చునని ఎన్‌టిఆర్ వైద్యసేవా ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఐ.రాజీవ్ తెలిపారు. 'ప్రజాశక్తి' నిర్వహించిన ముఖాముఖిలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. జిల్లాలో ఎన్ని నెట్‌వర్క్ ఆసుపత్రులు ఉన్నాయి, ఆయా ఆసుపత్రుల్లో ఎన్ని రకాల సేవలందిస్తున్నారు, పాయిజన్, జ్వరాల కేసులకు సంబంధించి ఏ ఆసుపత్రుల్లో సేవలందుతున్నాయి, రోగుల నుంచి డబ్బు వసూలు చేస్తే ఏవిధంగా ఫిర్యాదు చేయొచ్చు, గర్భిణుల ప్రసవాలకు సంబంధించి సేవలు ఏవిధంగా అందుతున్నాయి వంటి పలు అంశాలపై జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్ మాట్లాడారు.

ప్రశ్న: జిల్లాలో ఎన్‌టిఆర్ వైద్యసేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్ని ఆసుపత్రులు ఉన్నాయి?

డిసి: జిల్లాలో ఎన్‌టిఆర్ వైద్యసేవా ట్రస్ట్ ద్వారా వైద్య సేవలు అందించే నెట్‌వర్క్ ఆసుపత్రులు జిల్లాలో 31 ఉన్నాయి. ప్రభుత్వ ఆసుపత్రులు తొమ్మిది ఈ సేవలందిస్తున్నాయి.

ప్రశ్న: ఎన్‌టిఆర్ వైద్యసేవా ట్రస్ట్ ద్వారా ఎన్నిరకాల రోగాలకు చికిత్స అందుతోంది. ప్రధానంగా ఏమి ఉన్నాయి?

డిసి: మొత్తం 3,225 రోగాలకు సంబంధించిన సేవలు నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా అందుతున్నాయి. కేన్సర్, కిడ్నీ, గర్భిణుల ప్రసవాలు, జ్వరాలు, పాయిజన్ కేసులు వంటివి సైతం ఉన్నాయి.

ప్రశ్న: జిల్లాలో సరాసరిన నెలకు ఎన్‌టిఆర్ వైద్యసేవా ట్రస్ట్ ద్వారా ఎంతమంది చికిత్స పొందుతున్నారు?

డిసి: ఒక్కో నెల ఆరు వేల వరకూ ఉంటాయి. సరాసరిన లెక్కిస్తే నెలకు ఐదు వేల మంది రోగులు ఉచితంగా చికిత్స పొందుతున్నారు. గడిచిన ఆరు నెలల్లో పిహెచ్‌సిల్లో ఈ పథకంలో 523 ప్రసవాలు జరిగాయి. ప్రయివేట ఆసుపత్రుల్లోనూ ఈ పథకంలో ఉచిత ప్రసవాలు జరుగుతున్నాయి.

ప్రశ్న: ప్రసవాల కేసుల్లోనూ, ఇతర రోగాలకు సంబంధించిన కేసుల్లోనూ ప్రయివేటు నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు చెబుతున్నారు. అలా వసూలు చేస్తే ఏం చేయాలి?

డిసి: ఎన్‌టిఆర్ వైద్య సేవా ట్రస్ట్‌లో చికిత్స పొందే రోగులు ఎవరూ డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదు. ఎవరైనా డబ్బు అడిగితే ఆరోగ్యమిత్రల దృష్టికి తీసుకెళ్లొచ్చు. లేకపోతే 104కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. వైద్యం తిరస్కరించినా ఫిర్యాదు చేయవచ్చు.

ప్రశ్న: డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదు చేస్తే ఎటువంటి చర్యలు ఉంటాయి?

డిసి: ఫిర్యాదు అందగానే ముందుగా విచారణ చేస్తారు. డబ్బు వసూలు చేయడం నిజమని తేలితే జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని డిస్ట్రిక్ట్ డిసిప్లినరీ కమిటీ జరిమానా వేస్తోంది. వసూలు చేసిన సొమ్ముకు ఇది పది రెట్లు వరకూ ఉంటుంది.

ప్రశ్న: ఆరోగ్యమిత్రలు ఎంతమంది ఉన్నారు? వీరి విధులు ఏమిటి?

డిసి: జిల్లాలో మొత్తం 69 మంది ఆరోగ్యమిత్రలు ఉన్నారు. రోగ నిర్ధారణ తర్వాత ఎన్‌టిఆర్ వైద్యసేవా ట్రస్ట్‌కు దరఖాస్తు చేయడం నుంచి వారికి అందే ఆహారం, ఇతర సమస్యలతోపాటు రోగి డిశ్చార్జి అయ్యే వరకూ ఆరోగ్య మిత్రలు మోనటరింగ్ చేస్తారు.

ప్రశ్న: ఆరోగ్యశ్రీ కార్డులేని వారు వైద్యం పొందేందుకు అవకాశం ఉందా?

డిసి: ఆరోగ్యశ్రీ కార్డు లేకపోయినప్పటికీ అర్హతగల వెనుకబడిన వారికి ప్రత్యేక సౌకర్యం ఉంది. సిఎంసిఒ (చీఫ్ మినిస్టర్ క్యాంప్ ఆఫీస్) ద్వారా జిల్లా కోఆర్డినేటర్ సంతకంతో లెటర్ తీసుకోవాలి. ఆ లెటర్ ద్వారా ఉచితంగా వైద్యసేవలు పొందవచ్చు. ఆ సొమ్మును ఆసుపత్రులకు ప్రభుత్వం అందిస్తుంది.

ప్రశ్న: జిల్లాలో కేన్సర్ రోగులకు వైద్యం ఎక్కడ అందుతోంది. ముందుగా రోగ నిర్ధారణ కోసం చేస్తున్న టెస్టులు ఎన్‌టిఆర్ వైద్య సేవా ట్రస్ట్‌లో వర్తిస్తాయా?

డిసి: జిల్లాలో ఆశ్రం, గుడ్ సమరిటన్ ఆసుపత్రుల్లో ఎన్‌టిఆర్ వైద్యసేవా ట్రస్ట్ ద్వారా ఉచితంగా కేన్సర్ రోగులకు వైద్యసేవలు అందుతున్నాయి. కేన్సర్ నిర్ధారణ కోసం ముందుగా చేస్తున్న టెస్ట్‌లకు సంబంధించి వైద్యసేవా ట్రస్ట్‌లో పెడితే తిరిగి డబ్బులు వస్తాయి.

ప్రశ్న: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గడిచిన ఆరు నెలల్లో ఇప్పటి వరకూ ఎన్‌టిఆర్ వైద్యసేవా ట్రస్ట్ ద్వారా ఎన్ని సర్జరీలు జరిగాయి. ఎంత ఖర్చయ్యింది?

డిసి: గడిచిన ఆరు నెలల్లో మొత్తం సర్జరీలు 5,668 జరిగాయి. రూ.11.63 కోట్లు ఖర్చయ్యింది.

ప్రశ్న: జ్వరాలకు సంబంధించి ఎన్‌టిఆర్ వైద్యసేవా ట్రస్ట్‌లో వైద్యసేవలు అందిస్తున్నారా?

డిసి: డెంగీ, టైఫాయిడ్, మలేరియా వంటి జ్వరాలకు ఈ పథకంలో ఉచిత వైద్యసేవలు అందుతున్నాయి. అయితే అన్ని నెట్‌వర్క్ ఆసుపత్రుల్లోనూ ఈ సేవలు లేవు. ఏలూరులో ఆశ్రం, చైత్ర ఆసుపత్రుల్లోనూ, జంగారెడ్డిగూడెంలోని పలు ఆసుపత్రుల్లో మొత్తం ఆరు చోట్ల ఈ సేవలు అందుతున్నాయి.

ప్రశ్న: పాయిజన్ కేసులకు సంబంధించి ఉచిత వైద్యం ఉందా?

డిసి: పాయిజన్ కేసులకు ఎన్‌టిఆర్ వైద్యసేవా ట్రస్ట్‌లో ఉచిత వైద్యం ఉంది. అయితే క్రిటికల్ కేర్ ఆసుపత్రుల్లో మాత్రమే ఈ సేవలు అందుతాయి. పురుగుమందు తాగినా, పాముకాటు సంభవించినా ఉచిత వైద్యం అందుతోంది. ఏలూరు ఆశ్రం ఆసుపత్రిలో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి.






పేదలకు పూర్తి ఆరోగ్య భద్రతే లక్ష్యం

ఉచిత వైద్య శిబిరం నిర్వహణ అభినందనీయం

మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - చాట్రాయి

గ్రామీణ ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని చిన్నంపేటలో విజయవాడ మణిపాల్ హాస్పటల్, జివిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శిబిరంలో సాధారణ వైద్య పరీక్షలు, కేన్సర్ పరీక్షలు, కంటి పరీక్ష, గుండె పరీక్ష, ఊపిరితిత్తుల పరీక్షా కేంద్రాలను ఆయన పరిశీలించారు. వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులను పలకరించి వారు ఆరోగ్య పరిస్థితులను ఆరా తీశారు. అనంతరం జరిగిన సభలో మంత్రి పార్థసారథి మాట్లాడుతూ డబ్బుల్లేక ఏఒక్క పేదవాడు మెరుగైన వైద్యానికి దూరం కాకూడదనేదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రయివేటు సంస్థలు, స్వచ్ఛంద సేవాసంస్థలు నిర్వహించే మెగా వైద్యశిబిరాలను అంతా వినియోగించుకోవాలని ఆయన కోరారు. శిబిర నిర్వాహకులు మణిపాల్ హాస్పటల్, జివిఆర్ ట్రస్ట్‌లను మంత్రి అభినందించారు. ప్రస్తుతం ఆహారపు అలవాట్లలో మార్పుల కారణంగా ప్రజలు అనేక రోగాల బారిన పడుతున్నారన్నారు. కార్యక్రమంలో మణిపాల్ హాస్పటల్, జివిఆర్ ట్రస్ట్ ప్రతినిధులు, వైద్యులు, టిడిపి, జనసేన, బిజెపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి పార్థసారథి

దేశ సమైక్యతను, మత సామరస్యాన్ని కాపాడుకుందాం

ఆ నినాదంతో 2025కు స్వాగతం పలుకుదాం : సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

దేశ సమైక్యతను, మత సామరస్యాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో 2025 నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుదామని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. ఆదివారం స్థానిక ఉద్దరాజు రామం భవనంలో సిపిఎం నాయకులు 2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసే కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ స్వేచ్ఛ, సామరస్యం, సమానత్వం ప్రజల నడుమ నెలకొన్నప్పుడే ఏ అభివృద్ధికైనా ప్రయోజనం, సుస్థిరత తోడవుతాయన్నారు. నిజమైన ప్రజాస్వామ్యానికి అర్థం ఇదేనన్నారు. మతం వ్యక్తిగతమని, రాజకీయాలతో ముడిపెట్టకూడదని రాజ్యాంగం తెలియజేస్తోందని చెప్పారు. అన్ని మతాలు ప్రభుత్వం దృష్టిలో సమానమేనన్నారు. మతోన్మాద చర్యలను సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. బంగ్లాదేశ్‌లో మైనార్టీలుగా ఉన్న హిందూవులపై జరుగుతున్న దాడులను సిపిఎం ఖండిస్తుందన్నారు. గడప లోపలే మతం-గడప దాటితే భారతీయులమన్న సహోదర భావంతో ముందడుగు వేద్దామని, 2025వ సంవత్సరానికి స్వాగతం పలుకుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ, జిల్లా నాయకులు తామా ముత్యాలమ్మ, ఎస్.మహంకాళీరావు, ఎ.అప్పలస్వామి, ఎం.సత్యం, ఎస్.సాయి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిపిఎం నేతలు

ప్రభుత్వం, ప్రజల మధ్య వారధి ప్రజాశక్తి

క్యాలెండర్ ఆవిష్కరణలో పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ప్రభుత్వం, ప్రజల మధ్య వారధిలా పని చేయడంలో ప్రజాశక్తి దినపత్రిక ముందుంటుందని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. ప్రజాశక్తి 2025 క్యాలెండర్‌ను తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం రాత్రి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ క్యాలెండర్ ఆకర్షణీయంగా ఉందని ప్రశంసించారు. నియోజకవర్గంలో ప్రజా సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే కచ్చితంగా పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. దీంతోపాటు ప్రభుత్వ పథకాలపైనా ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత మీడియాపై ఉందని అన్నారు. ఏజెన్సీ ప్రాంత ప్రజల సమస్యలను వెలికితీయడంలో ప్రజాశక్తి కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి సిబ్బంది జి.మాణిక్యాలరావు, జి.మధుబాబు, పి.అర్జునరావు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ బాలరాజు

దేహదారుఢ్య పరీక్షలకు సర్వం సిద్ధం

హాజరు కానున్న 4,976 మంది కానిస్టేబుల్ అభ్యర్థులు

ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలకు సర్వం సిద్ధం చేశామని, పోలీసులకు బ్రీఫింగ్ సైతం పూర్తయిందని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఈ పరీక్షలను పూర్తి చేస్తామని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ అన్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థులకు సోమవారం నుంచి నిర్వహించే దేహదారుఢ్య పరీక్షలకు సంబంధించి అధికారులతో, సబ్బందితో ఆయన బ్రీఫింగ్ కార్యక్రమాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి, అధికారులకు సూచనలు, సలహాలు అందించారు. ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 4,976 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారని, వీరిలో 3,997 మంది పురుష అభ్యర్థులు, 979 మంది మహిళ అభ్యర్థులు ఉన్నారని తెలిపారు. మహిళా అభ్యర్థుల కోసం జనవరి 3, 4 తేదీల్లో ప్రత్యేక ఏర్పాట్లను పూర్తి చేశామని చెప్పారు. ఈ పరీక్షలు ఈ నెల 30వ తేదీ నుంచి జనవరి తొమ్మిదో తేదీ వరకు నిర్వహించినట్లు తెలిపారు. వీటికి సంబంధించిన బందోబస్తు ఏర్పాట్లను పూర్తి చేశామని చెప్పారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, ప్రత్యేక బందోబస్తును కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు సమయం కన్నా ముందుగానే మైదానానికి చేరుకోవాలని సూచించారు. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకునే బాధ్యత సిబ్బందికి, అధికారులకు అప్పగించామని తెలిపారు. ఈ పరీక్షలు అత్యధిక పరిజ్ఞానంతో నిర్వహించడంతో ఎటువంటి అవకతవకులు జరిగేందుకు అవకాశం లేదన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం వైద్య శిబిరాన్ని, రెండు అంబులెన్సులను సిద్ధంగా ఉంచామన్నారు. అభ్యర్థులు తమతో పాటు పదో తరగతి, ఇంటర్మీడియట్ ఒరిజినల్ సర్టిఫికెట్లను, ఒక సెట్ అటస్టడ్ కాపీలను తీసుకురావాలని సూచించారు. అభ్యర్థులకు మాత్రమే మైదానంలోకి అనుమతి ఉందని, వారి బంధువులకు లేదని తెలిపారు. అభ్యర్థులు దళారులను నమ్మవద్దని, ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామంటే నేరుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు అటువంటి వ్యక్తులు ఎవరైనా తారసపడితే వెంటనే ఏలూరు జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 9555035100 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి ఎన్.సూర్యచంద్రరవు, ఎఆర్ అదనపు ఎస్‌పి ఎన్ఎస్ఎస్.శేఖర్, పశ్చిమగోదావరి జిల్లా అదనపు ఎస్‌పి భీమారావు, తూర్పుగోదావరి జిల్లా ఎస్‌పి చెంచు రెడ్డి, ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్, ఎఆర్ డిఎస్‌పి చంద్రశేఖర్, ఎస్‌బి సిఐలు ఆదిప్రసాద్, మల్లేశ్వరరావు, నగరంలో సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్



కొన ఊపిరితో అన్నదాత..!

అన్నదాత ఆర్తనాదాలు 2024లోనూ మిన్నంటాయి. ప్రభుత్వాలు మారినా రైతుల పట్ల పాలకులకు ఉన్న చిన్నచూపు మాత్రం మారలేదు. వరదలు, తుఫాన్లకు రైతులు ఈ ఏడాదిలో దాదాపు 30 వేల ఎకరాల్లో వరి పంటను కోల్పోయారు. సాగు చేసిన కౌలురైతులకు ప్రభుత్వం ఏమాత్రం అండగా నిలబడలేకపోయింది. పంట నష్టపరిహారంతో సహా ఏ ఒక్కటీ వాస్తవ సాగుదారుడైన కౌలురైతులకు అందలేదు. ఆక్వా రైతుల కష్టాలు చెప్పచాలనవిగా మారాయి. ఎగుడు, దిగుడు ధరలతో మామిడి, పామాయిల్, కొబ్బరి రైతుల అవస్థలు వర్ణనాతీతం. పెరిగిన పెట్టుబడి ఖర్చులకు, వస్తున్న ఆదాయానికి ఏమాత్రం సంబంధం లేకపోవడంతో అన్నదాత కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ ఏడాదిలోనూ జిల్లాలో పలువురు కౌలురైతులు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు అందరినీ కలిచివేశాయి.

2024లో రైతులను వెంటాడిన కష్టాలు

వరదలు, తుపాన్లకు 30 వేల ఎకరాల్లో పంటనష్టం

రబీ ధాన్యం సొమ్ము కోసం రైతులు నెలలు తరబడి పడిగాపులు

ఆక్వా రైతుల అవస్థలు వర్ణనాతీతం

పామాయిల్, కొబ్బరి రైతులకు స్వల్ప ఊరట

ఆధునికీకరణకు పూర్తిగా పాతర

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పెద్దఎత్తున వరి సాగవుతోంది. రెండు సీజన్లు రబీ, ఖరీఫ్‌లో కలిపి పశ్చిమలో దాదాపు నాలుగున్నర లక్షల ఎకరాలు, ఏలూరు జిల్లాలో మూడు లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. 2023 డిసెంబర్ రెండో వారంలో మిచౌంగ్ తుపాను విరుచుకుపడటంతో రబీ నారుమడులన్నీ దెబ్బతిన్నాయి. రైతులు రెండోసారి నారుమడులు వేయాల్సి వచ్చింది. దీంతో ఈ ఏడాది ఫిబ్రవరి వరకూ రబీ నాట్లు సాగాయి. నీటిఎద్దడి సమస్యలను ఎదుర్కొని పంట పండించిన రైతులు ధాన్యం అమ్మకంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. లారీలు, గోనె సంచుల కోసం నానావస్థలు పడ్డారు. తీరా ధాన్యం విక్రయించిన తర్వాత రైతులకు ధాన్యం సొమ్ము అందక రైతులు పడిన కష్టాలు అన్నీఇన్నీ కావు. ఎన్నికలు రావడంతో రైతుల గోడును పట్టించుకునే నాథుడే లేకపోయాడు. పశ్చిమలో రూ.850 కోట్లు, ఏలూరు జిల్లాలో రూ.242 కోట్లు మొత్తం దాదాపు రూ.11 వందల కోట్లు ధాన్యం సొమ్ము రైతులకు అందలేదు. కూటమి అధికారం చేపట్టిన తర్వాత సెప్టెంబర్ వరకూ ధాన్యం సొమ్ము అందలేదు. ఏప్రిల్‌లో రబీ మాసూళ్లు పూర్తి చేసిన రైతులకు దాదాపు ఐదు నెలల తర్వాత ధాన్యం సొమ్ము అందడంతో తెచ్చిన పెట్టుబడులకు వడ్డీ తడిసిమోపెడై రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జూన్ ఒకటో తేదీనే కాలువలకు సాగునీరు విడుదల చేసినప్పటికీ జూన్ నెలాఖరునగాని నారుమడులు వేయడం ప్రారంభం కాలేదు. జులై మొదటి వారంలో విరుచుకుపడిన భారీ వర్షాలకు పశ్చిమలో 30 వేల ఎకరాల్లో, ఏలూరులో మూడు వేల ఎకరాల్లో నాట్లు దెబ్బతిన్నాయి. దాదాపు 1600 ఎకరాల్లో నారుమడులు దెబ్బతిన్నాయి. ఎన్యుమరేషన్ చేసిన అధికారులు 13,307 ఎకరాల్లో పంట నష్టపోయినట్లు తేల్చి మమ అనిపించారు. ఆదిలోనే రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. సెప్టెంబర్‌లో మరోసారి విరుచుకుపడిన వరదలు, వర్షాలకు ఏలూరు జిల్లాలో 7,884, పశ్చిమలో 8,546 ఎకరాల్లో మొత్తం దాదాపు 16 వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. దీంతో రైతులకు రూ.16 కోట్లు నష్టం వాటిల్లిందని అధికారులు తేల్చారు. 33 శాతానికిపైగా నష్టాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకున్నారు. అంతకన్నా తక్కువ నష్టపోయిన పంట వేలాది ఎకరాల్లో ఉంది. అలాంటి రైతులకు చిల్లిగవ్వ రాలేదు. సెప్టెంబర్‌లో దెబ్బతిన్న పంటలకు పరిహారం ప్రభుత్వం అందించింది. జులైలో దెబ్బతిన్న పంటలకు సంబంధించి రెండు జిల్లాల్లో రూ.11 కోట్లు నష్టపరిహారం అందించాల్సి ఉన్నప్పటికీ ఇప్పటికీ అందించలేదు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ మూడుసార్లు వాయుగుండాలు రైతులను వెంటాడాయి. దీంతో రైతులు ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు నానా ఇబ్బందులు పడ్డారు. ధాన్యం సొమ్ము త్వరితగతిన పడటం ఈసారి రైతులకు కొంత ఊరటగా చెప్పొచ్చు. అన్నదాత సుఖీభవ పేరుతో ప్రభుత్వం ఏడాదికి రూ.20 వేలు అందిస్తామని హామీ ఇచ్చి ఇప్పటికీ అందించకపోవడంపై రైతుల్లో తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది.

కౌలురైతుల పరిస్థితి అధ్వానం..★★★

ప్రభుత్వాలు మారినా కౌలురైతుల పరిస్థితి మాత్రం మారలేదు. కౌలుకార్డుల జారీలో తీవ్ర నిర్లక్ష్యం కొనసాగింది. రెండు జిల్లాల్లో మూడు లక్షల మంది వరకూ కౌలురైతులు ఉండగా ఏలూరు జిల్లాలో 65 వేల మందికి, పశ్చిమలో 87 వేల మందికే కౌలుకార్డులు జారీ చేశారు. రెండు జిల్లాల్లో ఇప్పటి వరకూ ఏలూరు జిల్లాలో 20 వేల మందికి రూ.140 కోట్లు, పశ్చిమలో 24 వేల మంది కౌలురైతులకు రూ.162 కోట్లు మాత్రమే రుణాలు మంజూరు చేశారు. జిల్లా వ్యవసాయ రుణ ప్రణాళికలో ఒక్కశాతం కూడా కౌలురైతులకు పంట రుణాలు అందించని పరిస్థితి నెలకొంది. వ్యవసాయం సాగు చేస్తున్న కౌలురైతులకు కాకుండా, సాగు చేయని భూయజమానులకు బ్యాంకర్లు పంట రుణాలు అందిస్తున్నారు. ఖరీఫ్‌లో దెబ్బతిన్న పంటలకు పరిహారంగాని, బీమాగాని ఏ ఒక్కటీ కౌలురైతులకు అందలేదు. కౌలుచట్టంలో మార్పులు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ప్రకటనలతోనే సరిపెట్టింది. దీంతో ఈ ఏడాది కౌలురైతులకు తీరని వ్యథే మిగిలింది.

ఆక్వా రైతులు విలవిల★★★

రొయ్యలు, చేపల సాగు చేస్తున్న రైతులు ఈ ఏడాది తీవ్ర కష్టాలు ఎదుర్కొన్నారు. సరైన ధర లేక, మేత ధరలు పెరిగిపోయి ఆక్వా రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. రెండు జిల్లాల్లో దాదాపు రెండు లక్షల ఎకరాల్లో ఆక్వా సాగవుతుండగా అందులో 90 వేల ఎకరాల్లో రొయ్యల సాగు ఉంది. చేపల ధర ఈ ఏడాదిలో అనేకసార్లు పడిపోయింది. కిలో రూ.125 ఉండే చేప ధర రూ.114 వరకూ పడిపోవడంతో చేపలు సాగు చేసే రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. రూప్‌చంద్ చేపల ధర కిలో రూ.80కి పడిపోయింది. రొయ్యల ధరలు సైతం నిలకడగా లేకపోవడం, వ్యాధులు చుట్టుముట్టడం, వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో రొయ్య సాగుచేసే రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు.



పామాయిల్, కొబ్బరి, మామిడి రైతుల కష్టాలు★★★

ఈ ఏడాది ఎగుడు, దిగుడు ధరలతో పామాయిల్, కొబ్బరి, మామిడి రైతులు కొంత ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఈ ఏడాది ఆరంభం నుంచి టన్ను పామాయిల్ ధర రూ.12,900 మాత్రమే పలికింది. దీంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. కొద్దిరోజుల క్రితం అనూహ్యంగా టన్ను ధర రూ.20 వేలు వరకూ పెరిగింది. అయితే పామాయిల్ సీజన్ తగ్గడంతో రైతులకు పెద్దగా ఉపయోగం లేని పరిస్థితి. కొబ్బరి రైతులకూ అదే పరిస్థితి. చాలా నెలలు కొబ్బరికాయ ఖరీదు ఆరేడు రూపాయలు మాత్రమే పలికింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కనీసంగా కాయ ధర రూ.15 ఉండాలంటూ రైతులు డిమాండ్ చేశారు. నవంబర్ నుంచి కొబ్బరి ధర సైతం పెరిగింది. కాయ రూ.12 నుంచి రూ.14 వరకూ పలుకుతోంది. దీంతో రైతులకు కొంత ఊరట ఏర్పడింది. ఈ ఏడాది తుపాన్లు, తెగుళ్లతో మామిడి రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. ధర కొంత ఆశాజనకంగా ఉన్నా దిగుబడి లేకుండాపోయింది. తేనె మంచుతో తెగుళ్ల సోకి మామిడి దిగుబడి అమాంతం పడిపోవడంతో రైతులకు ప్రయోజనం లేకుండాపోయింది.

అగ్రిమెంట్లు లేకుండానే మొక్కజొన్న సాగు..★★★

మొక్కజొన్న రైతుల పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. జిల్లాలో దాదాపు లక్ష ఎకరాల్లో మొక్కజొన్న సాగవుతోంది. దీనిలో సగానికిపైగా కంపెనీలు ఇచ్చే సీడ్స్ పంటనే సాగు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం రైతులకు సీడ్స్ అందించే కంపెనీలు అగ్రిమెంట్లు చేసుకోవాలి. ఎక్కడా అలా జరగడం లేదు. దీంతో పంట దిగుబడి రాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నా కంపెనీలు ఆదుకోవడం లేదు. నిబంధనల ప్రకారం రైతుకు దిగుబడి రాక నష్టపోతే సీడ్స్ కంపెనీలే నష్టపరిహారం ఇవ్వాలి. ఎక్కడా అలా జరగడం లేదు. ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఈ ఏడాదీ అదేవిధమైన పరిస్థితి సాగింది.

అటకెక్కిన డెల్టా ఆధునికీకరణ..★★★

గడిచిన ఐదేళ్లలో డెల్టా ఆధునికీకరణను పూర్తిగా గాలికొదిలేశారు. దాదాపు రూ.వెయ్యి కోట్లు పనులు చేయాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చినా ఆధునికీకరణపై దృష్టి పెట్టిన పరిస్థితి కన్పించడం లేదు. ఆధునికీకరణ పనులు చేయాలంటే జనవరిలో టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించాలి. కాలువలు మూసేసిన వెంటనే ఏప్రిల్ నెలాఖరు నుంచి పనులు ప్రారంభించి జూన్ ఒకటో తేదీ నాటికి పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇప్పటి వరకూ అటువంటి ప్రక్రియ ఏమీ జరగలేదు. డెల్టా ఆధునికీకరణ జరగకపోవడంతో ప్రతియేటా వరదలకు వేలాది ఎకరాల్లో పంట దెబ్బతింటోంది. కాలువలు మెరకదేరి శివారు పొలాలకు నీటి ఎద్దడి సమస్య వెంటాడుతోంది.

ఆగని కౌలురైతుల ఆత్మహత్యలు..★★★

వ్యవసాయ సాగులో కీలకమైన కౌలురైతులను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. దీంతో కౌలురైతుల ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. 2024లో పోలవరం, ముసునూరు తదితర మండలాల్లో రైతులు, కౌలురైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ప్రకృతి వైపరీత్యాలకు పంటలు దెబ్బతినడంతో అప్పులు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వం నుంచి కౌలురైతులకు ఎటువంటి సాయమూ అందకపోవడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో అందరికీ అన్నం పెట్టే అన్నదాతలు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

న్యూ ఇయర్ వేడుకలకు ప్రత్యేక అనుమతుల్లేవ్

ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నూతన సంవత్సర వేడుకలకు ఎటువంటి ప్రత్యేక అనుమతులు లేవని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాత సంవత్సరానికి వీడ్కోలు పలికి నూతన సంవత్సరంలోకి అడుగుపెడుతున్న జిల్లా ప్రజలకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సర వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే నిర్వాహకులు లౌడ్ స్పీకర్లు ఉపయోగించేందుకు కచ్చితంగా అనుమతి పొందాలని తెలిపారు. అశ్లీల నృత్యాలు నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. బార్లు, రెస్టారెంట్లు, క్లబ్బులు, హోటళ్లు నిర్ణీత సమయాలకు మూసి వేయాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ప్రజలు నూతన సంవత్సర వేడు కలను సంతోషంగా జరుపుకోవాలని, హద్దులు మీరితే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు.

యుటిఎఫ్ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - దెందులూరు

యుటిఎఫ్-2025 డైరీలు, జిఒ పుస్తకాలు, క్యాలెండర్లు, స్టిక్కర్లను యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో యుటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం సంఘ నాయకులు ఆవిష్కరించారు. వీటిని మండల శాఖలు కూడా ఆవిష్కరించి టీచర్లకు అందించాలని జిల్లా కమిటీ పక్షాన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ముస్తఫా ఆలీ, ప్రధాన కార్యదర్శి రవికుమార్, జిల్లా కార్యదర్శి నంబూరి రాంబాబు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు, దెందులూరు మండల శాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, కైకలూరు మండల శాఖ ప్రధాన కార్యదర్శి సురేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లాస్థాయిలో నవ్యశ్రీకి ప్రథమ బహుమతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి వికాస్ జూనియర్ కళాశాల విద్యార్థిని ముత్యాల నవ్యశ్రీ జిల్లా స్థాయిలో జరిగిన పెయింటింగ్ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించింది. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఏలూరులో జిల్లాస్థాయిలో ఈ నెల 27వ తేదీన వివిధ రకాల పోటీలు జరిగాయి. జిల్లాస్థాయి పెయింటింగ్ విభాగంలో జరిగిన పోటీల్లో నవ్యశ్రీ జిల్లా ప్రథమ స్థానం సాధించి ప్రథమ బహుమతి పొందింది. నవ్యశ్రీ మండలంలోని గురజ గ్రామానికి చెందిన మాలమహానాడు కైకలూరు నియోజకవర్గ కన్వీనర్ ముత్యాల శ్రీనివాసరావు కుమార్తె. ఈ సందర్భంగా నెహ్రూ యువ కేంద్రం నిర్వాహకులు జిల్లా ప్రథమ బహుమతి సాధించిన నవ్యశ్రీకి రూ.2,500 నగదు, మెమెంటో, ప్రశంసపత్రం దూలం కిషోర్ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య కళాశాల ప్రిన్సిపల్ వంకా వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. పెయింటింగ్ విభాగంలో ప్రథమ బహుమతి సాధించిన నవ్యశ్రీని కళాశాల ప్రిన్సిపల్ నక్క కనక మోహన్, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు. నవ్యశ్రీ బైపిసి రెండో సంవత్సరం చదువుతుంది.



నగదు బహుమతి అందుకుంటున్న నవ్యశ్రీ

ప్రజాసేవే 'మానవత' ధ్యేయం

ప్రజాశక్తి - మండవల్లి

ప్రజాసేవే ధ్యేయంగా మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ పని చేస్తుందని సంస్థ మండలాధ్యక్షులు గుడివాడ విజయ గణేష్‌కుమార్ స్పష్టం చేశారు. మానవతా స్వచ్ఛంద సంస్థ నెలవారీ సమావేశాన్ని జిల్లా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు విద్యకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించి ప్రోత్సహించడంతో పాటు ఎవరైనా చనిపోతే ఒంటరితనంలో ఉన్న వృద్ధుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించి ఆదుకుంటున్నామన్నారు. ఇప్పటికే అనేక రూపాల్లో సేవలందించినట్లు చెప్పారు. ప్రస్తుత మండలంలోని సోమేశ్వరరావుకు నిత్యావసర సరుకులతో పాటు ఆర్థిక సహాయాన్ని అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సుధాకర్ విజయకుమార్, ముక్తేశ్వరరావు సత్తిబాబు, ఎల్.రాంబాబు, పరిటి కిందిబాబు, వరద శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - పోలవరం

హైస్కూల్లో చదువుకున్న విద్యార్థులంతా ఒక్కచోట చేరి అదే స్కూలు ఆవరణలో అపూర్వ కలయిక కార్యక్రమం చేసుకుని తమ బాల్య స్మృతులను నెమరు వేసుకున్నారు. మండలంలోని గూటాల గ్రామంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1984-85 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు అపూర్వ సమ్మేళన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ నాటి విద్యార్థి మూడు సార్లు తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం ఎంఎల్ఏగా గెలుపొంది, కేబినెట్ మంత్రిగా పనిచేసిన కారుపాటి వివేకానందను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు హనుమంతరావు, సింహాద్రి వెంకట్రావు, జల్లేపల్లి బాబూరావు, రామచంద్రం సన్మానం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు మైగాపుల దుర్గాప్రసాద్, జల్లేపల్లి ధర్మరాజు, గిద్దా రామకృష్ణ, రావూరి పున్నరం, మహంతి వెంకటేశ్వరరావు, మొగల్ జోత్స్న, పూడి దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

కొండముచ్చులతో కోతులకు చెక్

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి గ్రామపంచాయతీ పరిధిలో కోతుల బెడద నివారించేందుకు గ్రామపంచాయతీ అధికారులు గ్రామంలో గత రెండు రోజులుగా కొండముచ్చులను తిప్పుతున్నారు. రెండు కొండముచ్చులను అద్దెకు తెచ్చి చెక్కు బండిపై ఉంచి కోతుల బెడద ఉన్న ప్రాంతాల్లో తిప్పుతున్నారు. ఇటీవల గ్రామంలో పంచాయతీ 150 కోతులను పట్టించి వేరే ప్రాంతాలకు తరలించారు. అప్పట్లో వేటగాళ్లు వేసిన ఉచ్చు నుంచి కొన్ని కోతులు తప్పించుకున్నాయి. గ్రామంలో వాటి సంచారం మొదలైంది. ఈ కోతులు గ్రామంలో మహిళలు, పిల్లలను, వసతి గృహాల విద్యార్థులను కరవడమే కాకుండా ఇళ్లల్లో దొరికిన తినుబండారాలను సైతం ఎత్తుకుపోతున్నాయి. కోతుల చేష్టలతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు. దీంతో గ్రామస్తుల నుంచి పంచాయతీకి వస్తున్న ఫిర్యాదులతో కోతులను తరిమేందుకు పంచాయతీ అధికారులు కొండముచ్చులను ప్రయోగిస్తున్నారు. ఈ కొండముచ్చులకు రోజుకు రూ.వెయ్యి అద్దె చెల్లించి వస్తున్నాం. వారం రోజుల పాటు పంచాయతీ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో కొండముచ్చులను తిప్పుతామని సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ తెలిపారు.

'ఎస్‌సి వర్గీకరణ వెంటనే అమలు చేయాలి'

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని చనుబండ గ్రామంలో ఎంఆర్‌పిఎస్ నూతన కమిటీని నియమించినట్లు మండలాధ్యక్షులు మేలుగుమాటి రవిరామ్ మాదిగ అన్నారు. చనుబండ గ్రామ కమిటీ అధ్యక్షులుగా కారుమంచి విస్తరయ్య మాదిగ, ఉపాధ్యక్షులుగా విషంపల్లి రాజా మదిగ, ప్రధాన కార్యదర్శిగా గాగద్దల కుటుంబరావు మాదిగ, ట్రెజరరీగా విషంపల్లి నరేష్‌మాదిగ, ప్రచార కార్యదర్శిగా కంచర్ల భాస్కర్‌రావు మాదిగ, సోషల్ మీడియా కన్వీనర్‌గా కంచర్ల కిరణ్ మాదిగ నియమితులైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కారుమంచి విస్తరయ్య మాదిగ మాట్లాడుతూ ఎబిసిడి వర్గీకరణ జరిగితే అట్టడుగున ఉన్న ప్రతి పేదవాడికీ విద్య, ఉద్యోగాల్లో, రాజకీయాల్లో ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశాలు వస్తాయన్నారు.

నేరాలు - ఘోరాలు

తెలంగాణ మద్యం పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని పి.రాజవరం గ్రామ పరిసర ప్రాంతాల్లో ఎక్సైజ్ సిఐ కె.శ్రీనుబాబు అధ్వర్యంలో ఆదివారం సాయంత్రం తనిఖీలు చేస్తుండగా గ్రామానికి చెందిన ఒక మహిళ వద్ద 13 మద్యం బాటిళ్లను గుర్తించినట్లు తెలిపారు. మద్యాన్ని స్వాధీనం చేసుకుని మహిళపై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఐలు సుబ్రహ్మణ్యం, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పాముకాటుకు గురైన వలస కూలీ

ప్రజాశక్తి - ముసునూరు

వలస కూలీ పాము కాటుకు గురైన సంఘటన మండలంలోని చింతలవల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా రోతరపూడి మండలం లచ్చిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన మెళ్ళ చలబాబు మండలంలోని మండలంలోని చింతలవల్లి శివారు గోగులంపాడు గ్రామానికి వలస వచ్చాడు. ఈ క్రమంలో ఆదివారం చెరుకు నరికే పనికి వెళ్లాడు. తోటి కూలీలతో కలిసి చెరుకు నరుకుతుండగా పాము కాటుకు గురయ్యాడు. అతడిని తోటి కూలీలు నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సంస్కరణలతో ఉక్కిరిబిక్కిరి



జిల్లా విద్యావ్యవస్థలో కీలక మార్పులు

ప్రజాశక్తి - దెందులూరు

2024 విద్యా వ్యవస్థలో పెను మార్పులు చోటు చేసుకున్నాయి. గత వైసిపి ప్రభుత్వం అమ్మఒడి, నాడు-నేడు, విద్యాదీవెన, వసతిదీవెన వంటి పథకాలను అమలు చేసింది. ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వర్తింపు, పాఠశాలల అదనపు భవనాల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన, నూతన సాంకేతిక విద్య, పాఠశాల స్థాయి నుంచి నైపుణ్యాల అభివృద్ధి, ఉపాధ్యాయుల నియామకానికి పెద్దపీట వేస్తోంది. ఉపాధ్యాయుల సర్దుబాటు, ప్రధానోపాధ్యాయుల రెసిడెన్షియల్ శిక్షణ వంటి నిర్ణయాలు తీసుకుంటోంది. మొత్తంగా విద్యారంగం సంస్కరణలకు వేదికగా మారింది.

జిల్లాల్లో 1,623 పాఠశాలలు

ఏలూరు జిల్లాలో 1,623 పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ ఆధీనంలో 991 ప్రాథమిక, 87 యుపి, 181 ఉన్నత పాఠశాలలు ఉండగా, ఎయిడెడ్ పాఠశాలల్లో 11 ప్రాథమిక, ఏడు ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ప్రయివేట్ ఆధీనంలో 75 ప్రాథమిక, 117 యుపి, 153 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 95,767 బాలురు, 92,597 బాలికలు మొత్తంగా 1,88,364 మంది విద్యను అభ్యసిస్తున్నారు. ఇందులో 9,27,246 మంది ప్రభుత్వ, 3,392 మంది ఎయిడెడ్, 92,246 మంది ప్రయివేట్ పాఠశాలల్లో చదువుతున్నారు.

పిఎం పోషన్ : డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం

జిల్లాలోని 1,294 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 88,272 మంది బాలబాలికలు లబ్ధి పొందుతున్నారు. సంవత్సరానికి సుమారుగా రూ.30.11 కోట్ల వ్యయంతో పిఎం పోషన్ మధ్యాహ్న భోజన పథకం అమలవుతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయాలని నిర్ణయించారు. అందుకు 19 కళాశాలల్లో 3,860 మంది విద్యార్థులను గుర్తించారు. ప్రభుత్వ పాఠశాలల్లో వండి కళాశాలకు పంపిస్తారు. నూతనంగా 69 మంది అదనపు కుక్‌లను నియమించనున్నారు. జనవరి నుంచి అమలు చేయనున్నారు.

140 మంది రాత్రి కాపలాదారులు

జిల్లాలో 140 మంది రాత్రి కాపలాదారులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్నారు. వారికి ప్రతినెలా రూ.ఆరు వేలు గౌరవ వేతనం చెల్లిస్తున్నారు. రాత్రి కాపలాదారులకు జూన్ 2024 వరకు గౌరవ వేతనం చెల్లించారు. ఏలూరు జిల్లాలో 1,333 మంది ఆయాలు పాఠశాలల్లో, జూనియర్ కాలేజీల్లో, ఇతరత్రా డిపార్టుమెంట్లలో పని చేస్తున్నారు. వారికి ప్రతినెలా గౌరవ వేతనం రూ.ఆరు వేలు చెల్లిస్తున్నారు. ఆయాలకు జూన్ 2024 వరకు గౌరవ వేతనం చెల్లించారు.

ఇంకా అమలు కాని 'తల్లికి వందనం'

తల్లికి వందనం పథకం కింద దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ప్రతి తల్లికీ, గుర్తింపు పొందిన సంరక్షకుడికి సంవత్సరానికి రూ.15 వేలు ఆర్థిక సహాయం అందిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న పిల్లలు ఉన్న తల్లులకు ప్రభుత్వం నేరుగా రూ.15 వేలు వార్షిక ఆర్థిక సహాయాన్ని అందిస్తామని చెప్పింది. కాని ఇప్పటివరకు ఈ హామీని నెరవేర్చలేదు. ఆ మేరకు చర్యలు తీసుకోలేదు.

మనబడి మన భవిష్యత్తు (స్కూల్ ఇన్‌స్ట్రక్చర్ ఇంప్రూవ్‌మెంట్)

ప్రభుత్వ బడుల రూపు రేఖలను మూడేళ్ల వ్యవధిలో సమూలంగా మార్చివేసి కార్పొరేట్ పాఠశాలల కన్నా మిన్నగా చేయడమే లక్ష్యమని టిడిపి కూటమి ప్రభుత్వం స్కూల్ ఇన్‌స్ట్రక్చర్ ఇంప్రూవ్‌మెంట్ కార్యక్రమాన్ని చేపట్టింది. గత వైసిపి ప్రభుత్వం చేపట్టిన మనబడి నాడు-నేడు పథకం పనులు నిలిచిపోయాయి. గత ప్రభుత్వంలో రెండో విడతలో భాగంగా జిల్లాలో 889 పాఠశాలల అభివృద్ధికి రూ.295.54 కోట్లు మంజూరు చేయడంతో పాటు రూ.162.92 కోట్లతో పనులు పూర్తి చేసింది. మిగిలిన రూ.132.62 కోట్లతో పనులు చేపట్టాల్సి ఉంది.

పాఠశాలల విలీనం

2022-24 మధ్యలో జాతీయ విద్యా విధానంలో భాగంగా మూడు నుంచి ఐదో తరగతి విద్యార్థులను ఆరు నుంచి పదో తరగతి పాఠశాలల్లో విలీనం చేశారు. ఒక కిలోమీటరులోపు ఉన్న 3, 4, 5 తరగతి విద్యార్థులను సమీప ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. మూడు కిలోమీటర్ల లోపు ఉన్న యుపి పాఠశాలల్లోని మూడ నుంచి ఎనిమిదో తరగతుల విద్యార్థులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు.

పేరు మార్పులు..పథకాల్లో స్వల్ప మార్పులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన వెంటనే గత ప్రభుత్వం అమలు చేసిన పథకాల్లో స్వల్ప మార్పులు చేసి పేర్లు మార్చారు. గత ప్రభుత్వంలో అమలు చేసిన అమ్మ ఒడి పథకాన్ని తల్లికి వందనం పేరిట మార్పు చేసినా ఇప్పటివరకు అమలు చేయలేదు. జగనన్న విద్యాకానుకను సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర పథకం కింద మార్పు చేశారు. జగనన్న గోరుముద్ద పథకాన్ని డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పేరిట మార్చి మెనూ మార్పునకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. స్వేచ్ఛ పథకాన్ని బాలికా రక్ష పథకంగా మార్పు చేసింది. ముత్యాలు పథకాన్ని ప్రతిభా పురస్కారం పేరిట మార్పు చేసింది.

హెచ్‌ఎం మృతిపై ఆగ్రహ జ్వాలలు

లీడర్‌షిప్ ట్రైనింగ్ కార్యక్రమంలో ఓ ప్రధానోపాధ్యాయుడు మృతి చెందడంపై ఉపాధ్యాయ వర్గం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మండలంలోని తోటపల్లిలో హీల్ ప్యారడైజ్ స్కూలులో శిక్షణలో ఉండగా టివి.రత్నకుమార్ ప్రధానోపాధ్యాయుడు గుండెపోటుతో మృతి చెందడం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కలిగించింది. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు ఆందోళనలు చేశాయి. ఉపాధ్యాయులకు నిర్వహించే శిక్షణను జిల్లా కేంద్రాల్లో చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి.


ఉపాధ్యాయుల్లో నిరాశ

ఉపాధ్యాయుల ప్రధాన కోరిక సిపిఎస్‌ను రద్దు చేయడం. అయితే గత ప్రభుత్వం సిపిఎస్ స్థానంలో మరో విధానం తెస్తానన్నా ఉపాధ్యాయులు తిరస్కరించారు. ఇప్పటి ప్రభుత్వం ఇంకా అందుకు ఉపక్రమించలేదు. నెలవారీ ఉద్యోగోన్నతులు బదులు సర్దుబాటు పేరుతో బదిలీలకు శ్రీకారం చుట్టారు.

> **పదో తరగతి విద్యార్థులకు వందరోజుల ప్రణాళిక**
>
> **డిఇఒ వెంకటలక్ష్మమ్మ**
>
> టెన్త్ విద్యార్థుల కోసం వంద రోజుల ప్రణాళిక డిసెంబర్ ఒకటి నుంచి అమలు చేస్తున్నాం. వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తాం. ఇందులో భాగంగా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నాం. ప్రభుత్వం ఇచ్చే మెటీరియల్‌తో పాటు, జిల్లా కలెక్టర్ సూచనలతో జిల్లా స్థాయిలో పదో తరగతి విద్యార్థులకు మెలయ్యేలా విజేత పుస్తకాన్ని విద్యార్థులకు అందిస్తున్నాం.

గుండెపోటుతో టిడిపి నేత చంద్రశేఖర్ మృతి

ప్రజాశక్తి - టి.నరసాపురం



చంద్రశేఖర్ (ఫైల్)

మండల కేంద్రమైన టి.నరసాపురం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు పెద్దిన చంద్రశేఖర్ ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. తెల్లవారుజామున గుండెల్లో నొప్పి వస్తుండడంతో కుటుంబీకులు చింతలపూడి ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఏలూరు ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. చంద్రశేఖర్ మృతి చెందిన విషయం తెలుసుకున్న పోలవరం ఎంఎల్ఏ చిర్రి బాలరాజుతో పాటు పలువురు కూటమి నాయకులు మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు జయ్యవరపు శ్రీరామమూర్తి, శీలం వెంకటేశ్వరరావు, అడపా నాగరాజు, నాయుడు రామకృష్ణ, పిన్నమనేని మధు, పాలేటి సత్తిబాబు, బొంతు సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు స్పోర్ట్స్ : విద్యార్థినులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ క్రాంతిప్రియ అన్నారు. ఆదివారం రాత్రి మహిళా రక్షక దళం జిల్లా వ్యాప్తంగా ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో గస్తీ నిర్వహించారు. ఇందులో భాగంగానే ఏలూరు నగరంలో మహిళా పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తూ మహిళా రక్షక దళానికి సారథ్యం వహిస్తున్న మహిళ ఎస్ఐ క్రాంతిప్రియ నగరంలోని బిసి హాస్టల్ విద్యార్థులకు ఆదివారం రాత్రి ప్రత్యేకంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు.

మధ్యాహ్న భోజనం పటిష్టంగా అమలు చేయాలి

మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగమణి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



సమావేశంలో మాట్లాడుతున్న నాగమణి

మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అనుబంధం జిల్లా కమిటీ సమావేశం అనురాధ అధ్యక్షతన ఆదివారం ఏలూరు సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగమణి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పౌష్టికాహార లోపం అరికట్టాలని కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కాని ఈ పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా, కార్మికులకు వేతనాలు పెంచకుండా వెట్టి చాకిరీ చేయిస్తుందన్నారు. కొత్త మెనూ జనవరి నుంచి అమలు చేస్తామని ప్రభుత్వ అంటుందని, ఇప్పటికే ఐదు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, గ్యాస్ ప్రభుత్వమే ఇవ్వాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ అతి తక్కువ వేతనాలతో మధ్యాహ్న భోజన కార్మికులు పని చేస్తున్నారని, వీరికి రూ.పది వేలకు వేతనాలు పెంచాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి, దుర్గ, అనంతలక్ష్మి, మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నేర నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం

మండవల్లి :నేర నియంత్రణకు, నేర పరిశోధనకు సిసి కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని కైకలూరు సిఐ రవికుమార్ స్పష్టం చేశారు. మండలంలోని చింతపాడులో ఆదివారం సిసి కెమెరాలపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక సిసి కెమెరా పదిమంది పోలీసులతో సమానమన్నారు. అవకాశం ఉన్న ప్రతిఒక్కరూ విధిగా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకుని నేరాలను నియంత్రించేందుకు సహకరించాలన్నారు. అంతేకాకుండా రోడ్లపై గేదెల సంచారంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే రహదారులపై విచ్చలవిడిగా తిరుగుతున్న గేదెల వల్ల ప్రమాదాలు జరిగి మృతి చెందినవారు, క్షతగాత్రులుగా మిగిలిపోయినవారు ఎంతోమంది ఉన్నారన్నారు. గేదెలు ఉన్న ప్రతిఒక్కరూ వాటి పట్ల శ్రద్ధ వహించి పర్యవేక్షించుకోవాలని, రోడ్లపైకి వదలకూడదని తెలిపారు. రోడ్లపై సంచరించే గేదెలను గోశాలకు తరలిస్తామన్నారు. అంతేకాకుండా గేదెల వల్ల జరిగే ప్రమాదాలను నియంత్రించే విధంగా యజమానులు గేదెల కొమ్ములకు రేడియం స్టిక్కర్లను అతికించాలని తెలిపారు. అనంతరం గేదెల యజమానులకు రేడియం స్టిక్కర్లను అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సిహెచ్ఎస్. రామచంద్రరావు, సర్పంచి విష్ణు, ఎంపిటిసి సభ్యులు యేసు రాజు, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సురక్షిత తాగునీరు అందించాలి

సుద్దనీరు వస్తుందని సిపిఎం నిరసన



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు, సిపిఎం నేతలు

ప్రజాశక్తి - పోలవరం

సుద్దనీరుతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, తక్షణమే సురక్షిత తాగు నీరు అందించాలని సిపిఎం మండల కార్యదర్శి కారం భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కోయనాగంపాలెం గ్రామంలోని ప్రజలతో కలిసి వాటర్ ట్యాంక్ వద్ద ఆదివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం పోలవరం మండల కార్యదర్శి కారం భాస్కర్ మాట్లాడుతూ గత ఆరేళ్లుగా కోయనాగంపాలెం గ్రామంలో తాగునీరు సుద్ద వస్తుందని, ఆ నీటినే తాగి ప్రజలు అనారోగ్యపాలయ్యారని చెప్పారు. గ్రామ ప్రజలకు కనీసం స్వచ్ఛమైన తాగునీరు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సుద్ద నీరు తాగి కాళ్లు, కీళ్ల వ్యాధులు వస్తున్నాయన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామానికి వచ్చినా సమస్యలు పరిష్కరించడంలేదన్నారు. సుద్ద నీటిని పరీక్షలు జరిపి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. గ్రామంలో వేరే చోట బోర్ మోటార్ వేయాలని డిమాండ్ చేశారు. దొండపూడి దూర ప్రాంతాలకు వెళ్లి తాగునీరు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. తక్షణమే గ్రామానికి సురక్షిత తాగునీరు అందించాలని, లేకపోతే గ్రామస్తులతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు మడివి చలపతిరావు, మిడియం పండు, మడివి రాంబాబు, సవలం జయలక్ష్మి, మిడియం గంగరాజు, సవలం అమ్మాజీ, సవలం దుర్గ, అర్జునమ్మ, మడకం నాగేశ్వరరావు, రాజు, వీరాయమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏలూరులో చిట్టిపొట్టి మూవీ యూనిట్ సందడి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

భాస్కర గ్రూప్ ఆఫ్ మీడియా పతాకంపై దాసరి భాస్కర్ యాదవ్ నిర్మించిన చిట్టిపొట్టి సినిమాకు విశేషమైన ప్రేక్షకాదరణ లభించిందని హీరో రామ్ మిట్టకంటి, డైరెక్టర్ భాస్కర్‌యాదవ్ అన్నారు. చిట్టిపొట్టి సినిమా ప్రమోషన్ కోసం దర్శక, నిర్మాత భాస్కర్‌యాదవ్, హీరో రామ్ మిట్టకంటి నగరంలోని ఎస్‌విసి మల్టిప్లెక్స్ థియేటర్‌కు విచ్చేశారు. మూవి యూనిట్‌కు ప్రేక్షకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం మీడియా సమావేశంలో నిర్మాత, దర్శకుడు భాస్కర్ యాదవ్, హీరో రామ్ మిట్టకంటి మాట్లాడుతూ అన్నా, చెల్లెలు సెంటిమెంట్‌తో ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామాగా ఈ చిత్రాన్ని ఆడియన్స్ ముందుకు తీసుకొచ్చామన్నారు. కథ గురించి వివరిస్తూ కొంతమంది ఆకతాయి బ్యాచ్ హీరో చెల్లి ఫొటోలను డీప్ ఫేక్ మార్ఫింగ్ చేయడంతో హీరో తన చెల్లిని కాపాడుకోవడం కోసం చేసే ప్రయత్నాలే ఈ సినిమాకు హైలైట్‌గా నిలుస్తాయన్నారు. తమ సినిమా చిన్న సినిమా అయినా ప్రేక్షకులను ఆకట్టుకుంటోందన్నారు. సినిమా రిలీజ్ అయిన అన్ని సెంటర్లలో ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ రావడం తమకు ఆనందంగా ఉందన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం సామాజిక బాధ్యత

ఏలూరు అర్బన్ : భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం సామాజిక బాధ్యతగా భావించి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆలిండియా ప్రోగ్రెసివ్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.హనుమంతరెడ్డి అన్నారు. ఆలిండియా ప్రోగ్రెసివ్ ఫోరం ఏలూరు యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక స్ఫూర్తి భవన్‌లో రాజ్యాంగం, పరిరక్షణ, ప్రజల కర్తవ్యం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య వక్తగా హాజరైన హనుమంత రెడ్డి మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం ప్రపంచంలోనే విశిష్టమైందన్నారు. సదస్సుకు ప్రోగ్రెసివ్ ఫోరం నాయకులు, ప్రముఖ న్యాయవాది పి.పి.శాస్త్రి స్వాగతం పలుకుగా ప్రోగ్రెసివ్ ఫోరం ఏలూరు యూనిట్ కార్యదర్శి మన్నవ యామిని వందన సమర్పణ చేశారు.

అపుస్మా రీజియన్ -2 అధ్యక్షునిగా బుల్లబ్బాయి

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఆంధ్రప్రదేశ్ ప్రయివేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) రీజియన్-2 అధ్యక్షునిగా నారాయణ పురం ఉషోదయ హైస్కూల్ డైరెక్టర్ గుణ్ణం బుల్లబ్బాయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలో కెఎల్.యూనివర్సిటీలో జరిగిన స్టేట్ జనరల్ బాడీ మీటింగ్‌లో బుల్లబ్బాయ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని స్టేట్ అసోసియేషన్ కమిటీ అభినందించారు. స్టేట్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా జంగా బాలాజీ, అడిషనల్ జనరల్ సెక్రటరీ ఎంబిఎస్.శర్మ ఇదే వేదికపై ఎన్నికయ్యారు.

పాస్‌పోర్టు పడిపోయినది

చెన్నూరి దివ్యశ్రీ అను నా యొక్క పాస్‌పోర్టు నెం.X7411808 నెంబరు గల పాస్‌పోర్టు పడిపోయినది. 24-12-2024వ తేదీ ఆదివారపు పేట నుంచి ఆర్.ఆర్.పేట వెళ్తుండగా మార్గ మధ్యలో పడిపోయినది. నా యొక్క పాస్‌పోర్టు నెంబర్ : X7411808 గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

అడ్రస్ : చెన్నూరి దివ్యశ్రీ,
లక్ష్మీవారపుపేట, గంగాళమ్మ గుడి దగ్గర.
సెల్: 98487 03294

సబ్‌జైలు సందర్శన

నూజివీడు టౌన్ :నూజివీడు సబ్ జైలును ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రిన్సిపల్, జిల్లా జడ్జి అరుణసారిక, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ కెవి.కృష్ణయ్య ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా సబ్‌జైలులోని వసతులు, నిందితుల ఆరోగ్యం, ఆహారం గురించి అడిగి తెలుసుకున్నారు. నిందితుల సాధక బాధలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సబ్ జైల్ అధికారులకు పలు సూచనలు చేశారు.

ప్రకటన

మహారాజశ్రీ పాలకొల్లు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S.No.174/2022

Between:
చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు, వల్లూరు బ్రాంచ్ రి.బై బ్రాంచ్ మేనేజర్ ...వాది
అండ్
చిట్టూరి వెంకట పెద్దిరాజు వగైరా ...ప్రతివాదులు
టూ
2వ ప్రతివాది: మొల్లేటి వెంకన్నబాబు, తండ్రి త్రిమూర్తులు, డోర్‌నెం.1-54/4, భీమలాపురం గ్రామం, ఆచంట మండలం, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నంబరు దావాను 1వ,3వ,4వ ప్రతివాదులు మరియు 2వ ప్రతివాది అయిన మీపైన వాది బ్యాంకు వారికి రావలసిన బాకి రాబట్టుకొనుటకు గానూ 1వ, 3వ, 4వ ప్రతివాదులు మరియు 2వ ప్రతివాది అయిన మీపైన శ్రీ పాలకొల్లు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో పై నంబరు దావాను దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీకోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం 2వ ప్రతివాది అయిన మీకు త్రు కోర్టు ద్వారా మరియు రిజిస్టర్ పోస్ట్ ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించినను తీసుకోకుండ కాలయాపన చేయుచున్నందున, శ్రీకోర్టు వారు ప్రత్యామ్నాయ సర్వీస్ అయిన పేపర్ ప్రకటన ద్వార దావా సమన్లు పంపించమని ఉత్తర్వులు ఇస్తూ **ది.08-01-2025** తేదికి వాయిదా వేసియున్నారు. కావున 2వ ప్రతివాది అయిన మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా **ది.08-01-2025** సం.తేదిన ఉదయం గం.10.30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలియ జేసుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్పు చెప్పబడును అని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

అడబాల సుబ్రహ్మణ్యం
అడ్వకేట్, నరసాపురం, ప.గో.జిల్లా.
స్టాండింగ్ కౌన్సిల్ ఫర్ చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు, వల్లూరు బ్రాంచ్.
పాలకొల్లు
తేది.26-12-24

NOTICE

IN THE COURT OF PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISION)-CUM-JUDICIAL MEGISTRATE OF FIRST CLASS, TADEPALLIGUDEM

I.A.No.367/2024 in O.S.No.538/2021

Between:
1.Sunkara Damayanthi ...Petitioner/Plaintiff
And
1.Sunkavalli Durga and Others ...Respondents
To.
RESPONDENTS 3 & 4/DEFENDANTS 3 to 4 :
3.Nakkalapudi Sujatha, W/o.Siva Rama Krishna, D/o.Late Gadde Prakasarao, Hindu, Female, Aged 42 Yrs, R/o.Singarajupalem village of Nallajerla Mandal, West Godavari District (3rd Defendant)
4.Pinnamaneni Suneetha, W/o.Venkateswara Rao, D/o.Late Gadde Prakasarao, Hindu, Female, aged 40 Yrs, R/o.Singarajupalem Village of Nallajerla Mandal, West Godavari District. (4th Defendant)

Please take notice that the above I.A.No.367/2024 in O.S.No.538/2021 is filed by the petitioner/Plaintiff against the respondents/defendants which is posted for the appearance of the above respondents 3 & 4 / Defendants 3 & 4 on **07-01-2025 from 10.30 AM.** Onwards, on which day you may appear in person or through your advocate and file your objections/Pleadings if any. Otherwise the matter will be adjudicate according to law in your absence.

G.Syama Prasad Mukherjee
N.Surya Mani, Advocate,
Tadepalligudem.
Tadepalligudem Cell:70937 08178,
Date: 29-12-2024 79936 47211.

ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S.No.153/2021

Between:
బ్యాంకు ఆఫ్ బరోడా, నరసాపురం బ్రాంచ్ రి.బై బ్రాంచ్ మేనేజర్ ...వాది
అండ్
తమ్మిసెట్టి విక్టోరియా వగైరా ...ప్రతివాదులు
టూ
1వ ప్రతివాది: తమ్మిసెట్టి విక్టోరియా, భర్త : రాజశేఖర్, డోర్‌నెం.24A-3-8A, రామయ్య హాల్, 11వ వార్డు, పాలకొల్లు, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నంబరు దావాను మీపైన మరియు 2వ ప్రతివాది పైన వాది బ్యాంకు వారికి రావలసిన బాకి రాబట్టుకొనుటకు గానూ మీపైన మరియు 2వ ప్రతివాది పైన శ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో పై నంబరు దావాను దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీకోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం 1వ ప్రతివాది అయిన మీకు త్రు కోర్టు ద్వారా మరియు రిజిస్టర్ పోస్ట్ ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించినను తీసుకోకుండ కాలయాపన చేయుచున్నందు, శ్రీకోర్టు వారు ప్రత్యామ్నాయ సర్వీస్ అయిన పేపర్ ప్రకటన ద్వారా దావా సమన్లు పంపించమని ఉత్తర్వులు ఇస్తూ **ది.10-01-2025** తేదికి వాయిదా వేసియున్నారు. కావున 1వ ప్రతివాది అయిన మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా **ది.10-01-2025** సం.తేదిన ఉదయం గం.10.30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలియ జేసుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్పు చెప్పబడును అని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

అడబాల సుబ్రహ్మణ్యం
అడ్వకేట్, నరసాపురం, ప.గో.జిల్లా.
స్టాండింగ్ కౌన్సిల్ ఫర్ బ్యాంకు ఆఫ్ బరోడా నరసాపురం బ్రాంచ్.
నరసాపురం
తేది.26-12-24

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, తాడేపల్లిగూడెం

E.P.No.96/2012 in O.S.No.653/2002

బిట్వీన్:
మార్నెడి సత్యనారాయణ, తండ్రి: లేటు కృష్ణ మూర్తి, డో.నెం.3-22-16, హిందువు, పురుషుడు, విమలానగర్, 5వ వార్డు, సుబ్బారావు పేట, తాడేపల్లిగూడెం, ప॥గో॥జిల్లా.
...డి. హెచ్.ఆర్ /ప్లెయింటిఫ్
మరియు
1) గూడా రామచంద్రరావు, తండ్రి: రాజా రావు, శివాలయం వీధి, 13వ వార్డు, తాడేపల్లిగూడెం, ప॥గో॥జిల్లా. (డైడ్)
...1st J.D.R /ప్రతివాది
2) గూడా సావిత్రి, భర్త: లేటు రామచంద్రరావు, హిందువు, స్త్రీ, వయస్సు సుమారు 50 సం॥లు, 7వ వార్డు, పి అండ్ & కాలనీ, తాడేపల్లిగూడెం, ప॥గో॥జిల్లా.
3) గూడా శ్రీనివాసరావు, తండ్రి: లేటు రామచంద్రరావు, హిందువు, పురుషుడు, వయస్సు సుమారు 35 సం॥లు, ప్రైవేటు ఉద్యోగం, 7వ వార్డు, పి అండ్ & కాలనీ, తాడేపల్లిగూడెం, ప॥గో॥జిల్లా.
4) గూడా ఈశ్వరరావు, తండ్రి: లేటు రామచంద్రరావు, హిందువు, పురుషుడు, వయస్సు సుమారు 32 సం॥లు, ప్రైవేటు ఉద్యోగం, 7వ వార్డు, పి అండ్ & కాలనీ, తాడేపల్లిగూడెం, ప॥గో॥జిల్లా.
5) గూడా గంగ తండ్రి: లేటు రామచంద్రరావు, హిందువు, స్త్రీ, వయస్సు సుమారు 30 సం॥లు, హౌస్ వైఫ్, 7వ వార్డు, పి అండ్ & కాలనీ, తాడేపల్లిగూడెం, ప॥గో॥జిల్లా.
...2 టు 5 జె.డి.ఆర్స్

పైన తెలియజేసిన డి.హెచ్.ఆర్. డిక్రీ బాకీ వసూలు నిమిత్తం పై నెంబరు గల ఇ.పి.96/2012 పైన తెలిపిన కోర్టులో వేసి Attachement Schedule / Sale Paper Schedule లోని 1/3 వంతు వాటాకు సంబంధించి కోర్టులో సేల్ ప్రొసీడింగ్స్ కండక్ట్ చేసి సదరు ఆస్థి కోర్టులో వేలం వేసి డిక్రీ అమౌంటు వసూలు చేయించవలసినదిగా కోర్టు వారిని కోరియున్నాడు. కనుక మీకు ఎటువంటి అభ్యంతరములు /ఆక్షేపణలు ఉన్న ఎడల **ది.03-01-2025 సం॥రం తేదీన సదరు కోర్టు వారి ముందు ఉదయం గం॥10:30 ని॥లకు హాజరై మీ అభ్యంతరములు తెలుపవలసినదిగా కోర్టు వారి ఆదేశానుసారం మీకు తెలియజేయడమైనది.** లేని పక్షమున మీ పరోక్షమున సేల్ ప్రొసీడింగ్స్ కోర్టు వారిచే జరుపబడును అని మీకు తెలియజేయడమైనది.

తాడేపల్లిగూడెం,
27-12-24.
పందూరి రామం
న్యాయవాది,
డి. హెచ్.ఆర్. తరపు అడ్వకేట్,
సెల్: 73820 83577